సాక్షి చిత్తూరు

మంగళవారం । 20 । ఫిబ్రవరి । 2024



స్పర్శ.. సర్వే!

కుష్టు వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా వైద్య ఆరోగ్యశాఖ వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. - 8లో



పేద బిడ్డలకు బంగారు భవిత

ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు సీఎం జగనన్న కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. - 8లో



సమస్యల పరిష్కారానికే 'స్పందన'

ప్రజాసమ్యల పరిష్కారానికే ప్రభుత్వం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఆర్‌ఓ పుల్లయ్య తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

సీఎం వైఎస్ జగన్ కోసం ప్రార్థనలు



వేలాంగణి చర్చి ఎదుట మిద్దింటి భరత్, కుటుంబసభ్యులు

పలమనేరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమే మళ్లీ రావాలని ఆకాంక్షిస్తూ పలమనేరు అంబేడ్కర్ నగర్‌కు చెందిన జగనన్న అభిమాని మిద్దింటి భరత్ తమిళనాడులోని వేలాంగణి చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. సోమవారం ఈ మేరకు ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాలకు మేలు చేకూర్చిన జగనన్న మళ్లీ సీఎం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందుకే కుటుంబసభ్యులతో కలిసి వేలాంగణి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టినట్లు వెల్లడించారు.

నేడు పది పరీక్షల కమిటీ సమావేశం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా త్వరలో నిర్వహించనున్న పదో తరగతి పరీక్షల నిర్వహణపై మంగళవారం కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ పుల్లయ్య ఆధ్వర్యంలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభంకానున్న సమావేశంలో మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న పదోతరగతి, మార్చి 18 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించే ఏపీ ఓపెన్ స్కూల్ పరీక్షల నిర్వహణపై చర్చించనున్నారు.

24న కాణిపాకం ఆలయ కమిటీ సమావేశం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ధర్మకర్తల మండలి సమావేశాన్ని ఈ నెల 24వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభంకానున్న సమావేశానికి బోర్డు సభ్యులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

జాబ్‌మేళాకు ఉచిత బస్సులు

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు సమీపంలోని ఎస్వీ సెట్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించనున్న రీజనల్ మెగా జాబ్‌మేళాకు అభ్యర్థుల సౌకర్యార్థం ఉచిత బస్సులు ఏర్పాటు చేసినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జాబ్‌మేళాలో 100కు పైగా కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. పది నుంచి పీజీ వరకు చదివి, 18 నుంచి 35 ఏళ్ల లోపువారు జాబ్‌మేళాకు హాజరుకావచ్చని వివరించారు. అభ్యర్థుల కోసం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు పీసీఆర్ సర్కిల్, కొత్త బస్టాండ్ నుంచి ఉచిత బస్సులు నడపనున్నట్లు చెప్పారు. ఇతర వివరాలకు 8142509017,6300954441 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు



కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని పలు మండలాల్లో మంగళవారం నుంచి ఈ నెల 23వ తేదీ వరకు ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 123 గ్రామ, వార్డు సచివాలయాల్లో క్యాంపులను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. జరుగుతుందన్నారు. క్యాంపుల్లో సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ మేరకు ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు.

మైనారిటీ కార్పొరేషన్ ఈడీగా ప్రభాకర్‌రెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి జిల్లా మైనారిటీ కార్పొరేషన్ ఈడీగా నియమితులయ్యారు. సోమవారం ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పరిషత్‌కు నూతన సీఈఓను నియమించే వరకు ప్రభాకర్‌రెడ్డి ఆ బాధ్యతలను నిర్వర్తించనున్నారు. గ్రామీణాభివృద్ధికి విశేషంగా కృషి చేసిన ప్రభాకర్‌రెడ్డి సుదీర్ఘకాలం జెడ్పీ సీఈఓగా పనిచేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆయనను మైనారిటీ కార్పొరేషన్‌కు బదిలీ చేశారు. బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈడీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మైనారిటీల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరువచేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి ఈడీకి శుభాకాంక్షలు తెలిపారు.

పేద కాపులకు నేస్తం

నాడు

టీడీపీ పాలనలో కాపులకు తీవ్ర అన్యాయం జరిగింది. వారి సమస్యలను విస్మరించారు. కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుని వదిలేశారు. వారు ఎదిగితే తనకు సమస్య వస్తుందని గ్రహించిన చంద్రబాబు కుట్రలకు తెరలేపారు. ఎన్నికల్లో మాత్రం వారికి ఊరించే హామీలు గుప్పించడం, తరువాత మర్చిపోవడం బాబు నైజమన్న విషయం కాపులకు తెలిసింది.

నేడు

కాపుల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైఎస్సార్ కాపునేస్తం పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం అమలుపై గత ఎన్నికల మేనిఫెస్టోలో ఎలాంటి హామీ ఇవ్వలేదు. అయినప్పటికీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కాపుల సంక్షేమానికి కాపు నేస్తం పథకాన్ని అమలు చేశారు. అర్హులైన లబ్ధిదారుల ఖాతాల్లో ప్రతి ఏటా రూ.15 వేలు నేరుగా జమచేశారు.



చిత్తూరు జిల్లాలో కాపునేస్తం పథకం మెగా చెక్కును అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు(ఫైల్)

కాపు నేస్తం పథకం వివరాలు

చిత్తూరు జిల్లాలో లబ్ధిదారులు	25,444 మంది
ఖర్చు చేసిన మొత్తం	రూ.38.18 కోట్లు
తిరుపతి జిల్లాలో లబ్ధిదారులు	17,274 మంది
ఖర్చు చేసిన మొత్తం	రూ.25.91 కోట్లు
రెండు జిల్లాల్లో లబ్ధి పొందిన వారు	42,718
రెండు జిల్లాల్లో ఖర్చు చేసిన మొత్తం	రూ.64.09 కోట్లు



- మేనిఫెస్టోలో చెప్పకపోయినాపథకం అమలు
- ప్రతి ఏటా లబ్ధిదారులకు రూ.15 వేలు అందజేసిన సీఎం జగన్
- గత పాలనలో మోసం చేసిన బాబు
- చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 42,718 మందికి లబ్ధి

చిత్తూరు కలెక్టరేట్ : కాపు వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ సర్కారు వైఎస్సార్ కాపునేస్తం పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం కింద చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో వేలాది మంది అర్హులకు ఆర్థిక సాయం అందించారు. ప్రతి ఏటా కాపునేస్తం పథకంలో లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం నేరుగా ఖాతాల్లో నగదు జమచేసింది. ప్రతి ఏటా సర్కారు అందజేసిన రూ.15 వేల నగదును కాపులు సద్వినియోగం చేసుకున్నారు. గతంలో ఏ సర్కారు చేయని మేలును కాపు వర్గాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసింది. కాపు నేస్తం పథకం అమలుపై 'సాక్షి' కథనం.

మేనిఫెస్టోలో చెప్పకపోయినా..

గత ఎన్నికల్లో కాపు నేస్తం పథకం అమలుపై ఎలాంటి హామీ ఇవ్వకపోయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కాపునేస్తం పథకాన్ని అమలు చేసింది. ఈ పథకంలో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలకు మేలు చేకూరింది. కాపు నేస్తం పథకంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన మిగిలిన అన్ని సంక్షేమ పథకాలు కాపు కులస్తులకు అందాయి. ఇప్పటి వరకు నాలుగు విడతల్లో కాపునేస్తం పథకాన్ని సర్కారు అమలు చేసింది. చిత్తూరు జిల్లాలో నాలుగు విడతల్లో 25,444 మందికి రూ.38.18 కోట్లను, తిరుపతి జిల్లాలో 17,274 మందికి రూ.25.91 కోట్లు రెండు జిల్లాల్లో మొత్తం 42,718 మందికి గాను రూ.64.09 కోట్లు సర్కారు ఖర్చు చేసింది.

కిరాణాకొట్టు నడుపుతున్నా



కాపునేస్తం ద్వారా నాకు రూ.60 వేలు ఆర్థిక సాయం అందింది. ఆ సాయంతో కిరాణా కొట్టు నడుపుతూ కుటుంబానికి అండగా ఉన్నా. ప్రస్తుత ప్రభుత్వం కాపులకంటూ ప్రత్యేకంగా ఒక పథకాన్ని పెట్టి ఆర్థిక సాయం అందించడం విశేషం. ఇంతగా సాయపడుతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నా.

– కాటమ్మ, అత్తూరు, నింద్ర మండలం, చిత్తూరు జిల్లా

రెండు ఆవులను కొన్నా



కాపు నేస్తం పథకం ద్వారా వచ్చిన నగదుతో రెండు ఆవులను కొనుగోలు చేసుకున్నాను. గత పాలకులెవ్వరూ మాకు మేలు చేయనేలేదు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వల్ల మాకు అన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయి. కాపు నేస్తంతో పాటు పలు రకాల పథకాల కింద లబ్ధి పొందాను. మాకోసం ఇంత చేస్తున్న జగనన్నకు రుణపడి ఉంటాం.

– నాగభూషణమ్మ, యాదమరి మండలం, చిత్తూరు జిల్లా

టైలరింగ్ మిషన్లు కొనుగోలు చేసుకున్నా



కాపు నేస్తంతోపాటు పలు సంక్షేమ పథకాల ద్వారా వచ్చే నగదుతో టైలరింగ్ మిషన్లు కొనుగోలు చేసుకుని జీవిస్తున్నాను. భర్త ఆకస్మికంగా మృతి చెందడంతో వితంతు పింఛన్ వస్తోంది. వై.ఎస్.ఆర్ ఆసరా, సున్నా వడ్డీ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నాను. గతంలో ఎప్పుడూ ఇన్ని పథకాలు అందలేదు. జగనన్న చేసిన మేలు జీవితంలో మర్చిపోలేను.

– వాణి, చిత్తూరు నగరం, చిత్తూరు జిల్లా

ఇప్పుడు సంతోషంగా ఉన్నాం



కాపునేస్తం పథకం కింద ఇచ్చిన నగదుతో పాడి ఆవులను కొనుగోలు చేసుకున్నాము. ఆ ఆవులు రోజుకు 8 లీటర్ల పాలు ఇస్తున్నాయి. వీటిని విక్రయించి జీవనం సాగిస్తున్నాం. ఇంకా ఆసరా, సున్నా వడ్డీ రుణాలు ఇచ్చారు. ఇప్పుడు మా ఇంటిల్లి పాది సంతోషంగా ఉన్నాము. జగనన్న రుణం మరిచిపోలేము. ఆయన్ను మళ్లీ సీఎంగా గెలిపించుకుంటాం.

– బేబి, యాదమరి మండలం, చిత్తూరు జిల్లా

కాపునేస్తం మాకెంతో ఆధారం



మా జీవనానికి కాపు నేస్తం కాస్త ఆధారంగా నిలిచింది. నేను వరుసగా నాలుగేళ్లు లబ్ధి పొందాను. ఏటా రూ.15 వేలు చొప్పున నాలుగేళ్లకు రూ.60 వేలు నా ఖాతాలో జమ చేశారు. పేదల కుటుంబాలకు ఈ పథకం ఎంతో దోహదపడుతుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మేం ఎంతో రుణపడి ఉన్నాం.

– వనమ్మ, ఏర్పేడు మండలం, తిరుపతి జిల్లా

కాపులకు ప్రత్యేక గుర్తింపు



ఇప్పటి వరకు కాపుల పేదరికాన్ని ప్రత్యేకంగా గుర్తించి వారికి సాయం చేసిన నేతలు ఎవ్వరూ లేరు. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైఎస్సార్ కాపునేస్తం పేరుతో 45–60 ఏళ్ల వయస్సు వారికి ఏటా రూ.15వేలు వారి ఖాతాల్లో జమ చేయడం ఎంతో సంతోషంగా ఉంది. నాలుగేళ్లలో రూ.60వేలు లబ్ధిపొందాను.

–డి.వసంత, బలిజ వీధి, సత్యవేడు, తిరుపతి జిల్లా



తిరుపతి జిల్లాలో లబ్ధిదారులకు కాపునేస్తం మెగాచెక్కు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు(ఫైల్)

గతంలో అన్యాయం



గత టీడీపీ పాలనలో మాకు అన్యాయం జరిగింది. మా గురించి పట్టించుకునేవారే లేరు. మనదేశంలో ఎక్కడాలేని విధంగా బలిజ/కాపు కులస్తులను ఆదుకునే ఉద్దేశంతో వైఎస్సార్ కాపునేస్తం పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. దీంతో మేమంతా ప్రశాంతంగా జీవనం సాగిస్తున్నాయి. మేమంతా జగనన్నకే మద్దతు తెలుపుతాం.

– డి.చంద్రమ్మ, బలిజ వీధి, సత్యవేడు, తిరుపతి జిల్లా

కొడుకులా ఆదుకుంటున్నాడు



ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సొంత కొడుకులా ఆదుకుంటున్నాడు. కాపునేస్తం ద్వారా నాకు నాలుగు వాయిదాల్లో రూ. 60 వేలు అందింది. అది నా కుటుంబానికి ఎంతో ఉపయోగపడింది. నాలా ఎందరికో కాపునేస్తం అండగా నిలుస్తోంది. ఇలాంటి మంచి పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిందే.

– సనపల్లి గౌరమ్మ, గట్టు, పుత్తూరు మండలం, తిరుపతి జిల్లా

జగనన్నకు రుణపడి ఉంటాం



పేద కాపులకు వైఎస్సార్ కాపునేస్తం ఓ వరంలాగా భావిస్తున్నాం. ఆ పథకం ద్వారా నాలుగేళ్లు వరుసగా ప్రతి ఏటా రూ.15వేలు చొప్పున రూ.60వేలు మా ఖాతాలోకి డబ్బులు వేశారు. దీంతో మా కుటుంబ అవసరాలకు ఆ నగదును సద్వినియోగం చేసుకున్నాం. ఇంత మంచి చేస్తున్న క్రమంలో మళ్లీ జగనన్నే సీఎంగా గెలిపించుకుంటాం.

– జి.సావిత్రమ్మ, గాయత్రీనగర్, తిరుపతి

కులమతాలకు అతీతంగా అభివృద్ధి



ఇంటి పట్టాలు పొందిన లబ్ధిదారులతో మంత్రి రోజా

విజయపురం : కులమతాలకు అతీతంగా అభివృద్ధిని చూసి వైఎస్సార్‌సీపీకి ఓటేయాలని మంత్రి ఆర్‌కే రోజా పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని కేవీపురంలో నిర్వహించిన ఇంటి పట్టాల పంపిణీలో ఆమె పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ నగరి నియోజకవర్గ ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలతో రూ.వందల కోట్లు అందించారన్నారు. ఒక్క కేవీపురంలోనే 21 సంక్షేమ పథకాల ద్వారా రూ.16 కోట్లు పంపిణీ చేసినట్లు వివరించారు. సంక్షేమ ఫలాలు సక్రమంగా అందాలన్నా.. కొనసాగాలన్నా వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. కేవీపురం సచివాలయ పరిధిలో రెండు విడతలుగా 149 మంది మహిళలకు ఇంటి స్థలాల పట్టాలు అందించడం ఆనందంగా ఉందన్నారు. టీడీపీ హయాంలో ఒక్కరికి కూడా ఇంటి స్థలం ఇవ్వలేదని ఆరోపించారు. ప్రతి ఒక్కరికీ జగనన్న ఇల్లు మంజూరు చేయించి, సొంత ఇంటి కల నెరవేర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వెల్లడించారు. పార్టీ మండల కన్వీనర్ గోపి, ఉపాధ్యక్షుడు బాలకృష్ణమనాయుడు, వైస్ ఎంపీపీ బాలాజీ, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు గోవర్ధన్‌నాయుడు, సర్పంచ్ రజని, సుధాకర్, ఆర్‌బీకే చైర్మన్ గుణశేఖర్‌రెడ్డి, హరినాయుడు, రవినాయుడు, నార్పరాజు, శివరాజు, ఎంపీటీసీ సభ్యుడు రాజ్‌గోపాల్, సర్పంచ్ కుమార్, సుధాకర్‌నాయుడు పాల్గొన్నారు.

23న వరసిద్ధుని హుండీ లెక్కింపు

కాణిపాకం(యాదమరి):కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి హుండీ లెక్కింపును ఈ నెల 23వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి స్వామివారి ఆస్థాన మండపంలో నిర్వహించే కానుకల లెక్కింపునకు ఆలయ అధికారులు, సిబ్బంది హాజరుకావాలని ఆదేశించారు.

బర్డ్ ఫ్లూపై అప్రమత్తం

చిత్తూరు అగ్రికల్చర్: కోళ్లకు సంక్రమిస్తున్న బర్డ్ ఫ్లూపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ ప్రభాకర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఇటీవల కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకినట్లు నిర్ధారణైందని వెల్లడించారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా 9.35 లక్షల ఫారం కోళ్లు, 6.5 లక్షల పెరటి కోళ్లు ఉన్నాయన్నారు. వీటిద్వారా ఏడాదికి 37,089 మెట్రిక్ టన్నుల కోడి మాంసం, 10,723 గుడ్లు ఉత్పత్తి అవుతున్నట్లు వివరించారు. ఈ క్రమంలో బర్డ్ ఫ్లూ వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. గుడ్లు, చికెన్‌ను కొనుగోలు చేసినవారు బాగా ఉడికించి భుజించాలని సూచించారు. ప్రస్తుతం నెల్లూరు జిల్లా నుంచి కోళ్లు, వాటి ఉత్పత్తులు, దాణా తీసుకురావడంపై నిషేధం విధించినట్లు వెల్లడించారు. ఎక్కడైనా ఎక్కువ సంఖ్యలో కోళ్లు మరణిస్తే వెంటనే సమీప పశువైద్యాధికారులకు తెలియజేయాలని ఆదేశించారు. ఈ మేరకు మండలాల వారీగా రాపిడ్ రెస్పాన్స్ టీములు ఏర్పాటు చేశామని వివరించారు.

నేడు కల్యాణ మస్తు..షాదీ తోఫా

- జిల్లాలో 437 మందికి రూ.3.55 కోట్ల లబ్ధి

చిత్తూరు కలెక్టరేట్ : పేద ఆడబిడ్డల వివాహాలకు ప్రభుత్వం చేయూతనందిస్తోంది. అందులో భాగంగా వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాలను అమలు చేస్తోంది. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లోని ఆడపిల్లల పెళ్లికి అండగా నిలుస్తోంది. ఈ క్రమంలో మంగళవారం ఐదోవిడత కల్యాణమస్తు, షాదీతోఫా పథకాలను అందించేందుకు చర్యలు చేపట్టింది. కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురం ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు జిల్లాస్థాయి కార్యక్రమం నిర్వహించేందుకు అధికారం యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ మేరకు డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కే రోజా, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఇతర ప్రజా ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొనేందుకు సమాచారం అందించింది. ఐదోవిడత కింద ఈ పథకాల జిల్లాలోని 437 మందికి లబ్ధిచేకూరనుంది. వారి ఖాతాల్లో రూ.3.55 కోట్లను ప్రభుత్వం జమ చేయనుంది.

ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 26వ తేదీన కుప్పం పర్యటన నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. సోమవారం ఈ మేరకు కలెక్టరేట్‌లో పలు శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురం మండలంలో నిర్వహించే బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొననున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో అన్నిశాఖల అధికారులు చిన్నపాటి తప్పిదాలకు సైతం తావు లేకుండా సమన్వయంతో పనిచేయాలన్నారు. అనంతరం సీఎం పర్యటనకు చేపట్టిన ఏర్పాట్లపై సమీక్షించారు. సమావేశంలో డీఆర్‌ఓ పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, హౌసింగ్ పీడీ పద్మనాభం, డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి, డీఈఓ దేవరాజు, సమగ్రశిక్ష ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి, సీపీఓ సాంబశివారెడ్డి, సంక్షేమ శాఖల అధికారులు రాజ్యలక్ష్మీ, రబ్బానీబాషా, డీపీఓ లక్ష్మీ, డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, ఏఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి పరిశీలన

శాంతిపురం : ముఖ్యమంత్రి ఈ నెల 26వ తేదీన కుప్పం పర్యటనకు విచ్చేస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లను కలెక్టర్ షణ్మోహన్ సోమవారం పరిశీలించారు. సభా ప్రాంగణం, పార్కింగ్ పనులను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. మండలంలోని గుండిశెట్టిపల్లి వద్ద హెలీప్యాడ్ ఏర్పాటుకు అవసరమైన స్థలాలను పరిశీలించారు. అదనపు పార్కింగ్‌కు మఠం క్రాసు, పొన్నేపల్లె, గుండిశెట్టిపల్లె వద్ద స్థలాలను ఖరారు చేశారు. డీఎస్పీ శ్రీనాథ్, రెస్కో చైర్మన్ సెంథిల్‌కుమార్, వైస్ చైర్మన్ కోదండరెడ్డి, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, పార్టీ మండల కన్వీనర్ బాబురెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ మనక్‌కు తవణంపల్లె విద్యార్థి



జిల్లా స్థాయి పోటీల్లో ప్రశంసాపత్రం అందుకుంటున్న ధీరజ్ (ఫైల్)

తవణంపల్లె : రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ మనక్ పోటీలకు తవణంపల్లె హైస్కూల్ విద్యార్థి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయని శ్రీరంజని తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ వాహన కాలుష్య నివారణపై తమ పాఠశాల 8వ తరగతి విద్యార్థి ధీరజ్ తయారు చేసిన ప్రాజెక్టుకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఎంపిక చేసినట్లు వివరించారు. ఎంపికైన విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.

సిలిండర్ తలపై పడి ఒకరి మృతి

పలమనేరు : గ్యాస్ సిలిండర్ తలపై పడడంతో ఒకరు మృతి చెందిన ఘటన సోమవారం మండలంలోని బేలుపల్లె క్రాస్ వద్ద జరిగింది. వివరాలు.. చెన్నై– బెంగలూరు ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో కూలి పనులకు వెస్ట్ బెంగాల్ నుంచి కొందరు వచ్చారు. బేలుపల్లె వద్ద గుడారాలు వేసుకుని నివసిస్తున్నారు. ఈ క్రమంలో కృష్ణశర్మ(43) అనే కూలి బైక్‌పై సిలిండర్ తెస్తూ తలపై పడడంతో మరణించాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్పర్శ.. సర్వే!

కుష్టు నిర్మూలనకు ప్రభుత్వం పకడ్బందీ ప్రణాళిక అమలు చేస్తోంది. పలు సర్వేలతో బాధితులను గుర్తించేందుకు చర్యలు చేపట్టింది. అవయవాలను నిర్వీర్యం చేసే మహమ్మారి నుంచి రోగులను కాపాడేందుకు విశేషంగా కృషి చేస్తోంది. అందులో భాగంగా ప్రభుత్వాస్పత్రుల్లో మల్టీ డ్రగ్ థెరపీని అందుబాటులోకి తీసుకువచ్చింది. వ్యాధిగ్రస్తులకు సకాలంలో చికిత్సలందిస్తూ పూర్తిగా నయమయ్యే వరకు పర్యవేక్షిస్తోంది.

- కుష్టు నిర్మూలనే లక్ష్యంగా పకడ్బందీ ప్రణాళిక
- జిల్లావ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు
- స్పర్శ కింద 10 కేసులు
- లెప్రసీ కేస్ డిటెక్షన్ సర్వే కింద 50 కేసులు
- గత ఏడాది 62 కేసుల గుర్తింపు
- మల్టీ డ్రగ్ థెరపీతో రోగులకు చికిత్సలు



సర్వే చేస్తున్న వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది

చిత్తూరు రూరల్ : కుష్టు పేరు వినగానే భయపడే రోజులు పోయాయి. మహారోగం నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో బాధితుల సంఖ్య క్రమేణా తగ్గుతోంది. అయితే ఈ వ్యాధిని పూర్తిగా అరికట్టేందుకు జిల్లా వైద్యఆరోగ్య శాఖ సిబ్బంది కృషి చేస్తున్నారు. అందులో భాగంగా కుష్టు రోగుల గుర్తింపునకు ఇంటింటి సర్వే చేపట్టారు. ఎవరికైనా వ్యాధి నిర్ధారణ అయితే వెంటనే మందులు పంపిణీ చేస్తున్నారు. రోగం పూర్తిగా తగ్గే వరకూ నిత్యం పరిశీలిస్తున్నారు. శరీరంపై మచ్చలుగా మొదలై.. పుండ్లుగా మారి.. సున్నితమైన అవయవాలకు ముప్పు తెచ్చే కుష్టును ముందుగా గుర్తించి తగిన చికిత్స చేయడం ద్వారా నయం చేయవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. నిర్లక్ష్యం చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందే అని హెచ్చరిస్తున్నారు. శరీరంలోని నాడీ వ్యవస్థ, ముక్కు, గొంతులోని మృదువైన కణజాలానికి ఈ వ్యాధి హాని చేస్తుందని వెల్లడిస్తున్నారు. అలాగే కంటి చూపు సైతం దెబ్బ తినే ప్రమాదముందని వివరిస్తున్నారు. ఈ రోగం సోకిన వారు ముందుగా స్పర్శ కోల్పోతారు. అందువల్ల గాయాలు తగిలినా నొప్పి తెలియదు. చివరకు రోగి చేతులు, కాళ్ల వేళ్లకు నష్టం జరిగి, వైకల్యానికి దారి తీస్తుంది.

బాధితుల గుర్తింపు ఇలా..

ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల మేరకు కుష్టు వ్యాధిపై ప్రజలను చైతన్యవంతం చేసేందుకు ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు చేపట్టింది. అందులో భాగంగా కుష్టు రహిత జిల్లా సాధన దిశగా అధికార యంత్రాంగం కార్యాచరణ అమలు చేస్తోంది. స్పర్శ అనే నినాదంతో కుష్టుపై సమరం సాగిస్తోంది. ఇది అంటు రోగం కాదని, సకాలంలో గుర్తించి ప్రాథమిక దశలోనే మెరుగైన చికిత్స అందిస్తే పూర్తి స్థాయిలో నయం చేయవచ్చని వివరిస్తోంది. ఈ మేరకు ఈ ఏడాది జనవరి 30వ తేదీ నుంచి స్పర్శ పేరిట అవగాహన కార్యక్రమాలను ప్రారంభించింది. ఈనెల 13వ తేదీ వరకు నిర్వహించింది. అలాగే జనవరి నుంచి లెప్రసీ కేస్ డిటెక్షన్ సర్వే (ఎల్‌సీడీసీ) ప్రారంభించి ఈనెల 17వ తేదీను ముగించింది. ఈ క్రమంలో మొత్తం 60 కేసులను గుర్తించినట్లు వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది వెల్లడిస్తున్నారు. గత ఏడాది ఇదే సర్వేల్లో 62 కేసులు నమోదైనట్లు వివరిస్తున్నారు.

చికిత్స ఇలా..

మైక్రో బ్యాక్టీరియం లెప్రే అనే బ్యాక్టీరియా కారణంగా కుష్టు వస్తుంది. ఈ క్రిములు తుమ్మడం, దగ్గడం ద్వారా వ్యాప్తి చెందుతాయి. వ్యాధి లక్షణాలు కనిపించేందుకు 3 నుంచి 5 ఏళ్లు పడుతుంది. రోగం నిర్ధారించిన తర్వాత రెండు పద్ధతుల్లో చికిత్స అందిస్తారు. శరీరంపై మూడు మచ్చలున్న వారికి ఆరు నెలల పాటు, ఐదు మచ్చలు పైబడి ఉన్న వారికి మల్టీ బ్యాసిలరీ (ఎంబీ) విధానంలో 12 నెలల పాటు చికిత్స చేస్తారు. రోగులకు నెలకు అవసరమైన మందులను ఒకేసారి నేరుగా వారి ఇళ్ల వద్దనే వైద్య సిబ్బంది అందిస్తారు. సర్వేలో గుర్తించిన రోగులకు సకాలంలో చికిత్స అందించడంతో పాటు ఆ వ్యాధిపై వారి కుటుంబ సభ్యులకు సైతం అవగాహన కల్పిస్తారు. ప్రస్తుతం అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో మల్టీ డ్రగ్ థెరపీని అందుబాటులోకి తీసుకువచ్చి ఈ వ్యాధిని అరికడుతున్నారు. అలాగే వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల సిఫార్సు మేరకు కుష్టు వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ప్రతి నెలా పింఛన్ ఇస్తోంది.

విస్తృతంగా అవగాహన...



జిల్లాను కుష్టు రహితంగా మార్చేందుకు వైద్య, ఆరోగ్య శాఖ కృషి చేస్తోంది. పాఠశాలలు, పీహెచ్‌సీలు, ఆరోగ్య కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కుష్టు వ్యాధి లక్షణాలపై ప్రజలకు వివరిస్తున్నారు. వ్యాధి ఇతరులకు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తున్నారు.

– వెంకటప్రసాద్, జిల్లా లెప్రసీ, టీబీ నివారణ అధికారి, చిత్తూరు

పేద బిడ్డలకు బంగారు భవిత



శిలాఫలకం ఆవిష్కరణలో ఎమ్మెల్యే వెంకటేగౌడ తదితరులు

గంగవరం : ప్రభుత్వ పాఠశాలలోని పేద విద్యార్థులకు బంగారు భవిష్యత్ అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. సోమవారం కీలపల్లె గ్రామంలో రూ.43లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, పొన్నమాకులపల్లె జెడ్పీ హైస్కూల్‌లో రూ.36లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో శిథిలావస్థకు చేరిన సర్కారు బడులను నాడు–నేడు పథకం కింద కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియంలో నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నారని వెల్లడించారు. జగనన్న ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. అలాగే జగనన్న గోరుముద్ద కింద పౌష్టికాహారం, అమ్మఒడి తదితర పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్ కోసం రూ.వేల కోట్లు వెచ్చిస్తున్న మీ జగన్ మామయ్యకు మీరే స్టార్ క్యాంపెయినర్లని తెలిపారు. మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాకారం కావాలన్న తపనతో సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారని వివరించారు. ప్రభుత్వ పరిపాలన ప్రతి గడపకూ చేర్చాలనే లక్ష్యంతో దేశంలో ఎక్కడా జరగని విధంగా మన రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థను రూపొందించారని చెప్పారు.

ఇంతకంటే రెట్టింపు సంక్షేమ పథకాలు అందాలంటే రాబోయే ఎన్నికల్లో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటరమణ, పార్టీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, సర్పంచుల మండల అధ్యక్షుడు గిరిరాజారెడ్డి, సర్పంచ్ రెడ్డెప్పరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు నాగేంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత శ్రీరాములురెడ్డి, చలపతిరెడ్డి, సిద్ధప్ప, ఆనందస్వామి, కిషోర్‌గౌడ్, ఆదినారాయణరెడ్డి, గోపాల్, మునెప్ప, సోమశేఖర్‌రెడ్డి, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ‘స్పందన’



అర్జీ పరిశీలిస్తున్న డీఆర్‌ఓ పుల్లయ్య.

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఆర్‌ఓ పుల్లయ్య తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో డ్వామా పీడీ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ, మైనారిటీ కార్పొరేషన్ ఈడీ ప్రభాకర్‌రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మీతో కలిసి అర్జీలు స్వీకరించారు. క్షేత్రస్థాయిలో అధికారులతో మాట్లాడి పలు సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించారు. అనంతరం డీఆర్‌ఓ మాట్లాడుతూ స్పందనలో నమోదయ్యే అర్జీలను తప్పనిసరిగా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్పందనలో వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 182 వినతులు వచ్చినట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు.

పోలీసు స్పందనకు 19 ఫిర్యాదులు

చిత్తూరు అర్బన్: చిత్తూరులోని జిల్లా పోలీసు కార్యాలయం (ఏఆర్)లో సోమవారం నిర్వహించిన స్పందనకు 19 ఫిర్యాదులు అందాయి. ఏఎస్పీ ఆరీఫుల్లా ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. అనంతరం సంబంధిత స్టేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ప్రతి ఫిర్యాదును విచారించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి



గాయపడిన గంగాధరం

పూతలపట్టు: మండలంలోని ఎగువ పాలకూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త వి.గంగాధరంపై టీడీపీకి చెందిన బి.శివలింగం, బి.శివాజీ, వి.మార్కొండయ్య సోమవారం దాడికి పాల్పడ్డారు. కట్టెలతో విచక్షణారహితంగా దాడి చేయడంతో గంగాధరం తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని వెంటనే స్థానికులు చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గంగాధరం కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్య



లక్ష్మి మృతదేహం

రొంపిచెర్ల: మండలంలోని పెద్దమల్లెల పంచాయతీ బేస్తపల్లెలో సోమవారం ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు.. దుస్సావారిపల్లెకు చెందిన నరేంద్ర (36) అనే ఆర్మీ ఉద్యోగికి లక్ష్మి(32)తో వివాహమైంది. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. లక్ష్మీ గత రెండేళ్లుగా రొంపిచెర్లలో టైలరింగ్ షాపు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో రోజూ బేస్తపల్లెలోని పుట్టింటి నుంచి రొంపిచెర్లకు వచ్చి వెళ్లేది. ఏమైందో తెలియదు కానీ సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుంది. పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. ఆమె ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. లక్ష్మి మృతదేహాన్ని అన్నమయ్య జిల్లా పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆర్మీలో విధులు నిర్వర్తిస్తున్న మృతురాలి భర్త వచ్చిన తర్వాత పోస్టుమార్టం చేయించనున్నట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించనున్నట్లు వెల్లడించారు.

అభ్యసన సామర్థ్యాల పరిశీలన



విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకుంటున్న డీఈఓ దేవరాజు

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరులోని పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలను డీఈఓ దేవరాజు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదోతరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. డీఈఓ మాట్లాడుతూ పది విద్యార్థులు సమయం వృథా చేయకుండా పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. ప్రణాళిక ప్రకారం సబ్జెక్టులను రివిజన్ చేయాలని కోరారు. అర్థం కాని పాఠాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని చెప్పారు. సమయం తక్కువగా ఉన్నందున సెల్‌ఫోన్, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. పరీక్షలపై విద్యార్థులు భయాందోళన చెందకుండా టీచర్లు అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని పూర్వాణి, పీడీ బాబు పాల్గొన్నారు.


మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న కారు, మద్యంతోపాటు నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

తవణంపల్లె : మండలంలోని మత్యం క్రాస్‌లో సోమవారం చేపట్టిన వాహన తనిఖీల్లో భాగంగా కారులో కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. విచారణలో పెద్దపంజాణి మండలం సంపల్లెకు చెందిన ఎం.లవకుమార్(27)ను నిందితుడిగా గుర్తించామన్నారు. నిందితుడి నుంచి రూ.5లక్షల విలువైన కారు, రూ.50వేల మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. తనిఖీల్లో పాల్గొన్న ఎస్‌ఐ సుధాకర్ రెడ్డి, ఏఎస్‌ఐ దేవరాజులు రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రవికుమార్ రెడ్డి, కానిస్టేబుల్స్ సుధాకర్, వేణుగోపాల్ రెడ్డి, శ్రావంత్‌కుమార్‌ను అభినందించారు. .

రైలు పట్టాలపై సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతదేహం



శ్రీనాథ్ (ఫైల్)

గుడుపల్లె : గుడుపల్లె రైల్వే గేటుకు సమీపంలో రైలు పట్టాలపై శ్రీనాథ్(28) అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతదేహం లభ్యమైంది. వివరాలు.. శాంతిపురం మండలం శివరాంపురం గడ్డూరు గ్రామానికి చెందిన వెంకటముని కుమారుడు శ్రీనాథ్‌కు 9 నెలల క్రితం కర్ణాటకకు చెందిన సౌమ్యతో వివాహం జరిగింది. దంపతులు ఇద్దరూ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా పని చేస్తున్నారు. ఈ క్రమంలో ఇద్దరూ శనివారం శివరామపురం గ్రామానికి వచ్చారు. ఆదివారం ఉదయం శాంతిపురం వరకు వెళ్లి వస్తానని భార్యతో చెప్పి శ్రీనాథ్ చెప్పి బైక్‌పై బయలుదేరాడు. కొంతసేపటికి సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో కుటుంబీకులకు అనుమానం వచ్చి గాలింపు చర్యలు చేపట్టారు. ఆచూకీ తెలియక పోవడంతో వెంటనే రాళ్లబూదుగూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో శ్రీనాథ్ మృతదేహం రైలు పట్టాలపై పడిఉండడం గమనించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. రైల్వే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించి శ్రీనాథ్ కుటుంబీకులకు సమాచారం అందించారు. రైలు పట్టాల సమీపంలోని మామిడితోటలో శ్రీనాథ్ ద్విచక్ర వాహనం గుర్తించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారి పడి యువకుడికి గాయాలు



గాయపడిన సుందర్ సాత్విక్

కుప్పంరూరల్ : కుప్పం రైల్వేస్టేషన్ వద్ద ప్రమాదవశాత్తు సోమవారం రైలు నుంచి జారి పడి ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని లక్ష్మీపురానికి చెందిన సుందర్ సాత్విక్ కుటుంబ సభ్యులు బెంగళూరులో స్థిరపడ్డారు. సొంత పనుల నిమిత్తం సుందర్ సాత్విక్ బెంగళూరు నుంచి స్వగ్రామం వచ్చేందుకు బెంగళూరు–చెన్నై ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరాడు. కుప్పం రైల్వేస్టేషన్ రైలు ఆగకముందే దిగేందుకు యత్నిస్తూ జారి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో సుందర్‌సాత్విక్ కుడికాలు విరిగిపోయింది. క్షతగాత్రుడిని 108లో పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు శస్త్రచికిత్స చేసి కాలును మోకాలు వరకు తొలగించారు. ప్రస్తుతం సాత్విక్ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ నాగరాజు తెలిపారు.

తెప్పపై కల్యాణ వెంకన్న కటాక్షం



పుష్కరిణిలో తెప్పపై విహరిస్తున్న ఉభయ దేవేరీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామివారు

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి తెప్పోత్సవాల్లో భాగంగా మూడో రోజు సోమవారం సాయంత్రం తెప్పపై శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి విహరిస్తూ భక్తులను కటాక్షించారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు స్వామి వారు ఉభయ దేవేరులతో కలిసి విద్యుద్దీపాలంకరణలతో ప్రత్యేకంగా రూపొందించిన తెప్పను అధిరోహించి పుష్కరిణిలో ఐదు చుట్లు తిరుగుతూ భక్తులను కనువిందు చేశారు. అనంతరం ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు అనుగ్రహించారు. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల భక్తి సంకీర్తనలు, భజనలు ఆకట్టుకున్నాయి. కాగా మంగళవారం శ్రీ ఆండాళ్ అమ్మవారితో కలిసి శ్రీకృష్ణస్వామి వారు తెప్పలపై విహరించనున్నారు. పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ ఏఈవో మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ మోహన్‌రావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనంజయ పాల్గొన్నారు.



తెప్పోత్సవంలో పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్ స్వామి, ఆలయ అధికారులు

బస్సు ఢీకొని ట్రాక్టర్ బోల్తా



బంగారుపాళెం: మండలంలోని చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై సోమవారం ఉదయం బస్సు ఢీకొనడంతో ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బస్సులోని ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కేరళ నుంచి ఒడిశాకు బయల్దేరిన ఓ ప్రైవేట్ బస్సు నలగాంపల్లె వద్ద కట్టెల లోడుతో వెళుతున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రహదారికి అడ్డంగా పడిన ట్రాక్టర్‌ను, కట్టెలను తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.